# ముత్యమంత ఆశ

## - శివల పద్మ

ఉదయం నుంచీ నా మనస్సంతా ఎంతో కలవరంగా ఉంది!

దిగులుగా- బెంగగా ఉంది.

కారణం- ఈరోజే మేము తిరిగి వైజాగ్ బయల్దేరేది. ఇక్కడకు వచ్చి పదిరోజులైంది. చెల్లెళ్ళకీ తమ్ముడికీ పరీక్షలు అయిపోవడంతో హైదరాబాద్ తిరిగి వద్దామని మారాం చేసారు. నాన్నకి కూడా శలవులుండడంతో సరే అన్నారు.

హైదరాబాద్‌లో వరుణ్ బావ వుంటున్నాడు. తను ఒక మల్టీ నేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. కంపెనీ వాళ్ళిచ్చిన ఫ్లాట్‌లో ఉంటున్నాడు- కనుక మనం ఈ పదిరోజులు వాడి ఫ్లాట్‌లో ఉండచ్చంది అమ్మ. వరుణ్ తనకి తమ్ముడి కొడుకు.

ఆరకంగా ఓ మంచి ప్రోగ్రామ్ వేస్కుని బయల్దేరడం, ఈ పదిరోజులు పది క్షణాల్లా గడిచిపోవడం కూడా అయిపోయింది.

పాపం, వరుణ్ బావ వీలున్నంతమటుకు తీరిక చేస్కుని చూపించాల్సిన విశేషాలన్నీ చూపించాడు. తనకి తీరిక లేకపోతే కారునీ డ్రైవర్‌నీ ఇచ్చి పంపించేవాడు.

వరుణ్ బావ-

తనంటే నాకెంత ఆరాధనో మాటల్లో ఎలా చెప్పగలను? ఆరాధన- అభిమానం- పిచ్చిప్రేమ.

లైఫ్‌ని సీరియస్‌గా తీస్కునే తన ఏటిట్యూడ్ నాకెంతో నచ్చుతుంది.

మనస్సులో తనంటే ఎంత ఆరాధన ఉన్నా పెదవి విప్పి నేనెప్పుడూ తనతో చెప్పలేదు. చెప్పి ప్రయోజనం లేదు. ఎందుకంటే మేమిద్దరం పెళ్ళి చేస్కునే అవకాశాలు లేవు కనుక.

ఎదురు మేనరికం కుదరదు అని పైకి చెప్పుకుంటున్నా నిజానికి కారణం అదికాదు- అంతస్తుల్లో తేడా. మామయ్య వాళ్ళింట్లో అంతా డాక్టర్లు, ఇంజనీర్లు, ఫారిన్‌లో సెటిలైనవాళ్ళు.

నలుగురు ఆడపిల్లలం ఒక్కడే మగపిల్లాడు అవడంవలన ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మా చదువులు డిగ్రీ, ఇంటర్‌లతో ఆగిపోయాయి.

మా పెద్దబావల భార్యలిద్దరూ డాక్టర్లే. ఇక వాళ్ళు నన్నెక్కడ వాళ్ళింటి కోడలిని చేస్కుంటారు?

పైగా అంతస్తుల తేడాను గుర్తుపెట్టుకొని నేను కూడా ఎప్పుడూ వరుణ్ బావపట్ల ఆశలు పెంచుకోలేదు.

ఆశలైతే లేవేమోగానీ ప్రేమా అభిమానం ఎక్కడికి పోతాయి? అవి నిరంతరం నా మనస్సులో ఉంటాయి.

బట్టలు మడతపెట్టి పెట్టెలో పెడుతున్నదాన్ని పని ఆపేసి ఆలోచనల్లో పడ్డానేమో "నీలూ!" అన్న వరుణ్ బావ పిలుపుకి ఉలిక్కిపడ్డాను.

"ఏమిటి బావా!"

"ఏదో చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లున్నావు... ఏం లేదు. మా ఫ్రెండ్స్ ఇద్దరు వచ్చారు. ఏమీ అనుకోకపోతే కొద్దిగా టీ పెట్టవా ప్లీజ్..." అర్థింపుగా అడిగాడు.

"ప్చ్... దానికింత రిక్వెస్ట్ ఎందుకు? ఇప్పుడే తెస్తానుగా." నవ్వి లేచి కిచెన్‌లోకి నడిచాను.

టీ కోసం నీళ్ళు స్టౌమీద పెట్టి వెనుదిరిగాను. అక్కడ కిటికీలో నుంచి బావ ముఖం కన్పిస్తోంది.

చిన్న చిరునవ్వుతో- ఫ్రెండ్స్ చెప్పేది వింటున్నాడు. అందమైన ఆ ముఖాన్ని చూడగానే మళ్ళీ నాలో 'ఆ' కోరిక తలెత్తింది.

నిన్న రాత్రి నుంచీ నా మనస్సుని తొలిచేస్తున్న కోరిక! క్షణక్షణానికీ ఎక్కువౌతున్న కోరిక.

ఓ చిన్న కోరిక- అనుక్షణం నా ఆలోచనలని డామినేట్ చేస్తున్న ఓ చిన్న కోరిక-

ఆ ముఖాన్ని ఆప్యాయంగా నా చేతుల్లోకి తీస్కుని నుదుటి మీద మనసారా ఒక్కసారి ముద్దుపెట్టుకోవాలని-

ప్రియతమా! నా గుండెల్లో నీపట్ల కొండంత ప్రేమను నింపుకొని నా బ్రతుకు పయనంలో దాన్నే ప్రాణవాయువుగా చేసుకొని సాగిపోతున్నాని-

నిశ్శబ్దంగా చెప్పాలని- ఒక్కసారి- చివరిసారి. ఆ చిన్ని చర్యతో నా మనస్సుని చెప్పాలని కోరిక-

యాంత్రికంగా నీళ్ళలో టీపొడి వేసాను. పాలు కాచి దానిలో టీ డికాక్షన్ పంచదార కలిపాను.

కాదు- కలుపుతునే ఉన్నాను స్పూన్‌తో. మళ్ళీ అదే కోరిక! ఎలా? ఎలా తీరుతుందీ కోరిక?

అప్పుడే లోపలకి వచ్చిన బావ విచిత్రంగా చూసాడు నావైపు, స్పూన్‌వైపు.

దగ్గరగా వచ్చి సున్నితంగా భుజం తట్టాడు. "ఏయ్ నీలూ! ఏమిటా పరధ్యానం? ఎనీ థింగ్ రాంగ్?"

అంత దగ్గరగా తనని చూడగానే నా గుండె లయతప్పింది. చప్పున వెనక్కి తిరిగాను. మరో క్షణంలో ఆ ముఖాన్ని నా చేతుల్లోకి తీస్కునేదాన్నే...

"నీలూ! చెల్లాయిది మిర్రర్ వర్క్ ఉన్న డ్రెస్ మడతపెట్టావా!" అని అడుగుతూ అమ్మ వచ్చింది.

చటుక్కున దూరం జరిగాను.

బావ టీకప్పుల ట్రే తీస్కుని బయటకి వెళ్ళిపోయాడు. ఆ తర్వాతా అంతే- రెండు మూడుసార్లు ఇద్దరం ఒంటరిగా ఉన్నా రెండో నిముషంలో ఎవరో ఒకరు రావడం- నా కోరిక కోరికగా మిగిలిపోవడం అయ్యేది.

చివరకి తెగించి నేను తన రూమ్‌లోకి వెళ్ళాను. రీడింగ్ టేబుల్ దగ్గర కూర్చుని ఏదో రాస్కుంటున్నవాడల్లా నన్ను చూడగానే "రా నీలూ! ఏం కావాలి?" అనడిగాడు.

ఏం చెప్పాలో అర్థంకాక తడబడ్డాను.

"ఊరికే నీ రూమ్ ఎలా ఉంచుకున్నావో చూద్దామని..." అంటూ టేబుల్‌వైపు నడిచాను.

"ఎలా ఉంటుంది? ఇదిగో ఇలాగే..." అతని మాట విన్పించుకోకుండా ఆ ముఖంవైపే చూస్తూ దగ్గరికి వెళ్ళిన నేను హఠాత్తుగా ఫోన్ మ్రోగడంతో హతాశురాలినై ఆగిపోయాను. ఎనలేని నీరసం ఆవహించింది నాలో.

అతనో రెండు నిముషాలు ఫోన్‌లో మాట్లాడి లేచాడు. "నీలూ! ఒక్క అరగంట కోసం నేను బయటకి వెళ్తున్నాను. తొందరగానే వచ్చేస్తాను. సరేనా?" అంటూనే వెళ్ళిపోయాడు.

నా కళ్ళల్లో నీరు తిరిగింది.

తను చెప్పినట్లుగానే తొందరగా వచ్చినా నాకు అవకాశం దొరకలేదు. సాయంత్రం ఐదున్నరకి ట్రైన్, టైమ్ నాలుగు అయింది.

నాలో బాధ, ఉక్రోషం దాంతోపాటే ఆ కోరిక కూడా పెరగసాగాయి.

ఇప్పుడు వెళ్తే మళ్ళీ ఎప్పుడు వస్తానో తెలియదు. ఒకవేళ వచ్చినా మరెవరి భార్యగానో వస్తాను.

అంత ప్రేమను మనస్సులో ఉంచుకొని ఇంత చిన్న కోరికను తీర్చుకోలేకపోతున్నాను. ఛ... ఎందుకూ నేనూ ఆ ప్రేమా? మనస్సంతా కలత చెంది ఉత్సాహం ఆవిరైపోయింది. మౌనంగా మా ప్రయాణానికి కావలసినవన్నీ సర్దుతున్నాను. బయట గదిలో అమ్మా నాన్న బావా మాట్లాడుకుంటున్నారు.

నేను కిచెన్‌లోకి వెళ్ళి మధ్యాహ్నం భోజనం చేసిన కంచాలు కడిగి రాక్‌లో సర్దేసాను. ఫ్లాస్క్‌నిండా కాఫీ పోసి బావగదిలో పెట్టాను. వెనుతిరిగి వచ్చేస్తుండగా బావ వచ్చాడు.

"థాంక్ యూ నీలూ! నేనే నిన్నింకా అడుగుదామనుకుంటున్నాను." అన్నాడు ఫ్లాస్క్ చూసి.

నేనేం మాట్లాడలేదు. మనస్సంతా బాధగా ఉంది. ఏం



మాట్లాడను?

''నీలూ! ఉదయం నుంచీ డల్‌గా ఉన్నావేం? ఒంట్లో బాగాలేదా?'' మార్దవంగా అడిగాడు.

మనం ఎంతగానో ప్రేమించేవాళ్ళు మనతో ఒక్కముక్క ప్రేమగా మాట్లాడితే చాలు- ఆ మాట మనలో జీవం పోస్తుంది.

''బాగానే ఉన్నాను బావా!'' మనస్సు వశం తప్పుతుంటే నెమ్మదిగా చెప్పి వచ్చేయబోయాను.

''నీలూ! ఇలా రా...''

దగ్గరగా వెళ్ళి ప్రశ్నార్థకంగా చూసాను.

కొద్ది క్షణాలు నా కళ్ళలోకి చూసి రెండు అరచేతుల మధ్య నా ముఖాన్ని తీస్కుని ప్రపంచంలో లాలనని అంతా రంగరించి ముద్దుపెట్టుకున్నట్లు నా నుదుటి మీద పెదవులు అద్దాడు!!

ఒక తీయని వేణుగానంలా- ఒక చల్లని వెన్నెల కిరణంలా- ఒక అందమైన చిరుగాలి తెమ్మెరలా- ఏదో మధురానుభూతితో ఒళ్ళంతా పులకరించి- మాట్లాడలేకపోయాను.

''థాంక్ యూ నీలూ! నాకెందుకో నిన్నటి నుంచీ- నిన్ను చూసిన ప్రతిసారీ ఈ చిన్ని కోరిక నాలో కలుగుతూ వచ్చింది. చాలా చిన్న కోరిక- కానీ మనస్సంతా నిండిపోయిన కోరిక! ఎన్నోసార్లు ప్రయత్నించబోయాను. కానీ ఏదో అడ్డు... ఊ నువ్వేం అనుకోలేదుగా? నీమీద ఉన్న అభిమానాన్ని చెప్పడానికి నాకెంతో నచ్చిన చర్య ఇది! దయచేసి దీనికి అపార్థాల నలుపు రంగు పూయవుగా.''

వివశంగా వింటున్న నేను అప్రయత్నంగా తల అడ్డంగా ఊపాను.

''థాంక్స్...'' అభిమానంగా నా చేయినొక్కి వదిలి ఆ గదిలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

మొగలిపూరేకుల పరిమళం వంటి మధురమైన అనుభూతి మధ్య ఒంటరిగా ఉండిపోయాను నేను.

★